శిథిలావస్థలో పాత వంతెన

- నాగన్‌పల్లి పసుపు వాగు వంతెన పైభాగంలో తేలిన ఇనుపరాడ్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బోధన్: మండలంలోని నాగన్‌పల్లి గ్రామ అంచున ఉన్న పసుపు వాగు పాత వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన పైభాగంలో ఇనుప రాడ్లు తేలాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వంతెనపై పలు చోట్ల ప్రమాదకర గుంతలు ఉన్నాయి. నెలలు గడిచినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వంతెన మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణం కొనసాగిస్తుంటారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వంతెనపై తేలిన ఇనుప రాడ్లు, గుంతలు

పాత బీటీ రోడ్డు మీదుగా రవాణా..

కొత్త బైపాస్ రోడ్డు క్రాసింగ్ నుంచి పసుపు వాగు పాత వంతెన మీదుగా నాగన్‌పల్లి గ్రామం వరకు సుమారు కిలో మీటరు పైగా పొడవున ఉన్న బీటీ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారటడంతో అధికారులు కొన్ని నెలల క్రితం కంకర, డస్ట్‌తో చదును చేశారు. ప్రస్తుతం రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకల సమయంలో కంకర రోడ్డు మీదుగా దుమ్మూధూళీతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత బీటీ రోడ్డు రూపు రేఖలే మారిపోయాయి. బోధన్, సాలూర మండలంలోని 15 గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగా పట్టణ కేంద్రానికి వెళ్తుంటారు. ఈ రోడ్డు నిర్వహణను నేషనల్ హైవే అథారిటీ పర్యవేక్షిస్తోంది.

బైపాస్ రోడ్డులో కొత్త వంతెన

బోధన్ పట్టణ శివారు నుంచి మహారాష్ట్ర ప్రాంతం 63వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానంగా సాలూర అంతరాష్ట్ర చెక్ పోస్టు వరకు నాలుగు వరుసల అంతరాష్ట్ర రోడ్డు విస్తరణ చేపట్టారు. సుమారు 8 కిలో మీటర్ల పొడవునా నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా నాగన్‌పల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న పసుపు వాగు మీదుగా బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. వాగుపై కొత్తగా చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ఆఖరి దశకు చేరి నిలిచిపోయాయి. దీంతో కొత్త బైపాస్ రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలు లేవు. వంతెన పూర్తయితే వాహనాల రవాణా సాగే అవకాశాలు ఉంటాయి.



కంకర తేలిన నాగన్‌పల్లి-బోధన్ రోడ్డు

మరమ్మతులు చేపట్టాలి

పాత వంతెనపై భాగంలో ఇనుప రాడ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. పసుపు వాగుపై కొత్త వంతెన పూర్తయితే బైపాస్ రోడ్డులో వాహనాల రవాణా ప్రారంభమయ్యే వరకు పాత వంతెనకు మరమ్మతు పనులు చేపట్టాలి.

– నాగరాజు, నాగన్‌పల్లి గ్రామస్తుడు, బోధన్

ప్రతిపాదనలు పంపించాం

కొత్త బైపాస్ రోడ్డు క్రాసింగ్ నుంచి నాగన్‌పల్లి గ్రామం వరకు కొత్తగా బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరు ప్రక్రియ ప్రాసెస్‌లో ఉంది. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– కాంతారావు, నేషనల్ హైవే అథారిటీ అధికారి

దత్తాపూర్ లిఫ్ట్ చైర్మన్ ఎవరు?

- అధికారికంగా ఒకరు, అనధికారికంగా మరొకరు
- కొత్త ఎన్నికను సవాల్ చేస్తూ అధికారులకు మరో వ్యక్తి ఫిర్యాదు

డొంకేశ్వర్: మండలంలోని దత్తాపూర్ లిఫ్ట్ చైర్మన్ ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారికంగా ఓ వ్యక్తి కొనసాగుతుండగానే ఇటీవల మరో వ్యక్తిని నూతన చైర్మన్‌గా అనాధికారికంగా ఎన్నుకున్నారు. ఇది జరిగిన కొన్ని రోజులకే ఎన్నికను సవాల్ చేస్తూ ఇంకో వ్యక్తి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడం లిఫ్ట్ పరిధి గ్రామాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఫిర్యాదు చేసిన వ్యక్తి కూడా లిఫ్ట్ చైర్మన్ పదవి పోటీలో ఉన్నట్లు తెలిసింది. ఇందుకు తనకు కావాల్సిన రైతు ఓట్లను సైతం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. జరుగుతున్న పరిణామాల మధ్య లిఫ్ట్ చైర్మన్ ఎవరో కూడా ఇరిగేషన్ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. దత్తాపూర్ లిఫ్ట్ పరిధిలో మారంపల్లి, తొండాకూర్, దత్తాపూర్ గ్రామాలున్నాయి. ఈ మూడు గ్రామాలు కలిపి మొత్తం 1,000 ఎకరాల ఆయకట్టు ఉంది.



దత్తాపూర్ లిఫ్ట్

పదవి కోసం పోటాపోటీ

లిఫ్ట్ చైర్మన్‌గా పాత వ్యక్తి కొనసాగుతుండగానే నూతన చైర్మన్ పదవికి ఎన్నిక ఇటీవల జరిగింది. చైర్మన్ పదవికి ప్రధానంగా ఇద్దరు వ్యక్తులు పోటీలో నిలిచారు. చైర్మన్‌గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒకరిని డిసైడ్ చేయగా, అంతలోనే అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి తెరపైకి వచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సదరు వ్యక్తికి ఉన్న సాగు భూమి గ్రామ శివారులో లేదనే కారణంతో అతన్ని చైర్మన్ పదవి పోటీ నుంచి తప్పించారు. దీంతో అధికార పార్టీకి చెందిన వ్యక్తికే చైర్మన్ పదవి లాంఛనమైంది. రైతు ఓటర్లతో మెజార్టీ చూపించి లిఫ్ట్ చైర్మన్ కుర్చీని కైవసం చేసుకున్నాడు. అయితే కొన్ని రోజుల వరకు అంతా సవ్యంగానే నడిచింది. ఇటీవల నూతన చైర్మన్ ఎన్నికను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ వ్యక్తి ఇరిగేషన్ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. చైర్మన్‌గా ఎన్నికైన అధికార పార్టీ వ్యక్తికి గ్రామంలో సాగు భూమి లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నేడో, రేపో రైతులను వెంట తీసుకెళ్లి ఉన్నతాధికారులకు కలవనున్నట్లు సమాచారం. నూతన చైర్మన్ ఎన్నికైన వ్యక్తి సాక్ష్యాధారాలు చూపిస్తే పదవి గండం తప్పనుంది. ఒకవేళ పదవి గండం ఏర్పడితే కొత్త చైర్మన్ ఎవరనేది మరింత ఆసక్తికరంగా మారనుంది.

బాధితులకు వరం సీఎంఆర్ఎఫ్



అన్నారంలో చెక్కులు అందజేస్తున్న భూమేశ్‌రెడ్డి



బజార్‌కొత్తూర్‌లో చెక్కు అందజేస్తున్న నాయకులు

డొంకేశ్వర్: ఆపదలో మెరుగైన వైద్యం చేయించుకోలేని బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశరం భూమేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం డొంకేశ్వర్ మండలంలోని అన్నారం నికాల్‌పూర్, జీజీ నడ్కుడ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. సాదుల సాయికీర్తనకు రూ.60వేలు, సాయారెడ్డికి రూ.54వేలు అలాగే తక్కు సంధ్యారాణికి రూ.14వేలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైనట్లు భూమేశ్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బజార్ కొత్తూర్‌లో..

నందిపేట్: మండలంలోని బజార్ కొత్తూర్‌లో పల్లికొండ సుమలతకు మంజూరైన రూ. 16వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఆకుల లక్ష్మీనారాయణ, గోపు ముత్యం, తెలు నర్సయ్య, రాజు, గజేందర్, చంద్రయ్య, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సేవలకు దక్కిన పురస్కారం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో విశిష్ట సేవలు అందిస్తున్న పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారి తులసికుమార్‌కు పుడమి రత్న జాతీయస్థాయి విశిష్టసేవా పురస్కారం లభించింది. ఆదివారం ఖమ్మం జిల్లాలో పుడమి సాహితీ వేదిక సంస్థ ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి భక్తరామదాసు పదవతరం వారసుడైన కంచర్ల శ్రీనివాస్, పద్మశ్రీ వనజీవి రామయ్య, మానవ హక్కుల ప్రజా పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షురాలు హైమావతి, పుడమి రత్న జాతీయ అధ్యక్షుడు బాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పట్వారి తులసికుమార్‌కు ప్రశంస పత్రం, అవార్డు అందజేశారు. తులసికుమార్‌కు పురస్కారం లభించిడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియామకం



మాదస్తు శేఖర్

నందిపేట్: మండల కిరాణ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నందిపేటకు చెందిన మాదస్తు శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నందిపేటలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా మాదస్తు శేఖర్, ఉపాధ్యక్షుడిగా పాలకుర్తి ప్రదీప్, కార్యదర్శిగా మయావార్ శ్రీనివాస్, ఉపకార్యదర్శిగా షేక్ ఉస్మోద్దీన్, కోశాధికారిగా ఊరటి మనోహర్, కార్యవర్గ సభ్యులుగా బాలేవార్ కిషన్, బంధం సురేందర్, మాదస్తు సాయన్న, బంధం ప్రసాద్, కూర శ్రీనివాస్, రమేశ్ ఎన్నికయ్యారు.

ఆలయానికి నిధులు మంజూరు



బాల్కొండ: మండలంలోని బోదేపల్లిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన రూ. 9,83,443 ప్రొసీడింగ్‌ను కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సునీల్‌రెడ్డికి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన సాధనాశూరుల ప్రదర్శన



బాల్కొండ: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సాధనాశూరులు నిర్వహించిన ప్రదర్శనలు ప్రజలను అలరించాయి. మూఢ నమ్మకాలపై పాత్రలతో సన్ని వేశాలను నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిపాల్‌కు విశ్వకర్మ మహాసభ జాతీయ అవార్డు



మహిపాల్ చారి

డొంకేశ్వర్: విశ్వకర్మ మహాసభ జాతీయ అవార్డుకు డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామానికి చెందిన మహిపాల్ చారి ఎంపికయ్యారు. విశ్వకర్మ సంఘం నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న మహిపాల్ చారి విశ్వకర్మల అభ్యున్నతికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు వచ్చింది. హైదరాబాద్‌లో నిర్వహించిన మహాసభలో అవార్డు రావడంపై మహిపాల్ హర్షం వ్యక్తం చేస్తూ తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర సంఘాల అధ్యక్షులు చెడిలాల్ శర్మ, జగన్నాథం చారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టు కాలనీలో స్వచ్ఛ కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛకార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని 8వ వీధిలోని పార్కుల్లో గడ్డిని, పిచ్చిమొక్కలను, చెత్తాచెదారంను తొలగించారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల, కుక్కల బెడదను తొలగించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, ఎర్ర భూమయ్య, కొంతం రాజు, మద్దూరి గణేశ్, రవి, సత్యనారాయణగౌడ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ తరలిన నాయకులు

బోధన్‌టౌన్: జిల్లా కేంద్రానికి ఎమ్మెల్సీ కవిత వస్తున్న నేపథ్యంలో బోధన్ నుంచి బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, కౌన్సిలర్ బెంజర్ గంగారాం, నాయకులు రవిశంకర్‌గౌడ్, మధు, సాగర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగడతాం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నందిపేట: రాష్ట్రంలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగడతామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మండలంలోని చౌడమ్మ కొండూర్‌లో ఉన్న లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి ఆదివారం సాయంత్రం ఎమ్మెల్సీ కవిత అనిల్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉద్యోగాల పేరిట మోసపూరిత హామీలను ప్రజలకు వివరించేందుకు త్వరలోనే కమిటీలు వేస్తామని కవిత తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రాంకిషన్‌రావు, మాచర్ల సాగర్, ప్రభాకర్, మనోజ్ రావు, ముత్యం, బాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఇటుక బట్టి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆర్మూర్: ఇటీవల ట్రాక్టర్ కిందపడి మరణించిన ఇటుక బట్టి కార్మికుడు లక్ష్మయ్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు.మండలంలోని ఇస్సాపల్లి శివారులోని బాధిత కుటుంబాన్ని పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు.లేబర్ కార్డు,ఆధార్ కార్డులాంటి గుర్తింపు కార్డులు కూడా లేకుండా ఇటుక బట్టీల్లో కార్మికుల కుటుంబాలు శ్రమ దోపిడీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుడు మరణించి మూడు రోజులు గడుస్తున్నా పాలకులు, కార్మిక శాఖ అధికారులు, పోలీసులు విచారణ జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో కిషన్, శేఖర్, ఠాకూర్, అరవింద్, నజీర్, నిఖిల్, సిద్ధార్థ్, నితిన్, ప్రసాద్, కార్మికులు ఉన్నారు.



కార్మికుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

రూ. నాలుగు వేల జీవనభృతి ఇవ్వాలి

బోధన్: బీడి పరిశ్రమలో పని చేసే ప్రతి కార్మికుడికి నెలసరి రూ. నాలుగు వేల జీవన భృతి ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన బోధన్ ఏరియా యూనియన్ జనరల్‌బాడి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి నిబంధనలు, ఆంక్షలు లేకుండా అర్హులకు జీవనభృతి మంజూరు చేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి బీడీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాగ్య, లక్ష్మి, బిపాష బేగం, రేహానా బేగం, మౌనిక, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశ్



కమ్మర్‌పల్లిలో 1993-94 బ్యాచ్ విద్యార్థులు



బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో..

అ'పూర్వ' సమ్మేళనం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. పాతికేళ్ల తర్వాత అందరూ ఒకే చోట కలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. గురువులకు పాద పూజ నిర్వహించారు.

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993-94 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకే చోట కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ఉషోదయ జూనియర్ కళాశాలలో..

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని ఉషోదయ జూనియర్ కళాశాలకు చెందిన 2008-10 ఇంటర్ పూర్వ విద్యార్థులు డిగ్రీ కళాశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమ్మేళనం సందర్భంగా విద్యార్థులు ఒకే చోట కలవడం సంతోషంగా ఉందని ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ సూర్యప్రకాశ్ అన్నారు. అనంతరం అధ్యాపకులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ దుష్యంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రెంజర్లలో గురువులతో 1998-99 బ్యాచ్ విద్యార్థులు

సొసైటీ క్యాలెండర్, లోగో ఆవిష్కరణ




డొంకేశ్వర్: డొంకేశ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్, లోగోలను సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. రైతులకు ఉపయోగపడే సమాచారంతో క్యాలెండర్‌ను రూపొందించామని తెలిపారు. సొసైటీ వైస్ చైర్మన్ ముత్యం, డైరెక్టర్లు పెంటన్న, గంగారెడ్డి, గంగాధర్, ముత్తెన్న, రాజేశ్వర్ రెడ్డి, రాజుబాయి, సొసైటీ సీఈవో కృష్ణ కుమార్, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న క్రీడలు



మాక్లూర్: మండలంలోని మెట్టు గ్రామంలో కొనసాగుతున్న 38వ క్రిస్మస్ టోర్నమెంట్‌లో ఆదివారం కబడ్డీ పోటీలు జరిగాయి. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 7 టీంలు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహక అధ్యక్షుడ కె ప్రసాద్‌రాజు మాట్లాడుతూ.. పోటీలకు క్రీడాకారులు సకాలంలో హాజరై సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ రెవరెండ్ కె ఫ్రాంక్లిన్, కె రూబెన్, సాలమోహన్, మెడిద కేశ్ బాబు, బి అబ్రహం, నామ రత్నయ్య, డి సునీల్, కె ప్రశాంత్, టి డెవిడ్‌ప్రసన్న, ఎం ప్రణయ్, ఎం భాస్కర్ పాల్గొన్నారు.

బోధన్‌లో సినిమా షూటింగ్



బోధన్‌టౌన్: పట్టణంలోని కమ్మ సంఘంలో ఆదివారం బుల్లెట్ రెడ్డి సినిమా షూటింగ్ నిర్వహించారు. సినిమాలో ఆదినారాయణ హీరోగా, మేఘ హీరోయిన్‌గా నటిస్తున్నారు. బోధన్‌లో జరిగిన షూటింగ్‌లో ఫైట్ మాస్టర్ ఖయ్యూమ్ ఆధ్వర్యంలో హీరో విలన్ల మధ్య పోరాట సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా హీరో ఆదినారాయణ మాట్లాడుతూ.. బోధన్‌లో షూటింగ్ చేసుకోడానికి అనుమతి ఇచ్చిన ఏసీపీ శ్రీనివాస్, కమ్మ సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంవీఐకి సన్మానం



వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామానికి చెందిన మోటార్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉట్నూర్ సుభాష్ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఆయనను స్థానిక నాయకులు ఆదివారం శాలువాతో సన్మానించారు. సుభాష్ ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో ఎంవీఐగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి సి వెంకట నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు చాదల్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బైరి సంపత్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యవసాయ కూలీ మృతి

ఆర్మూర్‌టౌన్: మండలంలోని మిర్దాపల్లిలో వ్యవసాయ క్షేత్రంలో పొలం పనులు చేస్తుండగా దత్తారావు(43) అనే వ్యవసాయ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు.ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..ఆర్మూర్ మండలం మిర్దాపల్లికి చెందిన మారంపల్లి నారాయణ వద్ద బోధన్ మండలానికి చెందిన దత్తారావు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పొలం గట్టుపై పనిచేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.మృతుడి భార్య భూమాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం పేర్కొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	లీగల్లీ వీర్ (తెలుగు)-11.45, డ్రింకర్ సాయి(తెలుగు)-2.50, బేబీజాన్(హిందీ)-6.00, మాక్స్(తెలుగు)-9.30
స్క్రీన్-2	మాక్స్(తెలుగు)-10.40, 1.35, 7.15, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ (తెలుగు)-4.30, 10.40
స్క్రీన్-3	బేబీజాన్(హిందీ)-10.00, ముఫాసా(తెలుగు)- 1.30, 4.20, 7.10, 10.00
స్క్రీన్-4	పుష్ప-2 (తెలుగు) -10.05, 2.10, 6.15, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మాక్స్ (తెలుగు)-10.40, 1.30, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ (తెలుగు) - 4.30, పుష్ప2 -7.00, బేబీజాన్(హిందీ)-10.40
స్క్రీన్-2	బేబీజాన్(హిందీ)-1.00, పుష్ప-2(తెలుగు)-4.00, యుఐ(తెలుగు)-7.40, మాక్స్(తెలుగు)-10.20
స్క్రీన్-3	ముఫాసా(తెలుగు)3డీ-11.00, 5.00, 7.30, పుష్ప2-1.20, 10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-11.10, 3.15, మాక్స్(తెలుగు)-7.20, ముఫాసా(3డీ ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	ముఫాసా(3డీ తెలుగు)-10.30, 1.20, 7.30, బరోజ్-3డీ(తెలుగు) - 4.10, పుష్ప-2 (హిందీ)- 10.20
స్క్రీన్-3	బేబీజాన్(హిందీ)-11.00, 10.40, పుష్ప-2(హిందీ)-2.30, 6.35
స్క్రీన్-4	మాక్స్(తెలుగు)-10.30, 10.50, డ్రింకర్ సాయి(తెలుగు)-1.25, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ (తెలుగు)-4.35, బేబీజాన్(హిందీ)-7.20
లలితామహల్	యుఐ(తెలుగు)-11.15, 2.15, విడుదల2(తెలుగు)-6.15,9.15
దేవి	ముఫాసా(2డీ తెలుగు)-11.00, 2.15, 6.10 10.10
నటరాజ్	మాక్స్(తెలుగు)-11.00, 2.15, 6.10, 10.10
విజయ్	పుష్ప2 -10.30 2.15 6.10 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,300	వెండి(కిలో)	93,500
22 క్యారెట్స్	73,800		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800